లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేటి నుంచి పూజలు

ఆల్విన్‌కాలనీ: శ్రీలీలాద్రి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో లక్ష్మీనరసింహ స్వామి జయంతి సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ మాధవరం కాంతారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ఉత్సవారంభం, యాజమాన్య దీక్షధర్మ నరసింహ దీక్ష ఆరంభం, నిత్య హోమం, 11 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, సాయంత్రం 5.30 గంటలకు మహా కుంభ ఆరాధన, దేవతా ఆహ్వానం, తీర్థ గోష్టి వంటి కార్యక్రమాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 11వ తేదీన లక్ష్మీనరసింహ స్వామి జయంతి సందర్భంగా మాధవరం కాంతారావు దంపతులతో స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యమణి మాణిక్య ఆభరణాలు అందజేయనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మోతీనగర్‌కు చెందిన విత్తనాల శ్రీనివాస్‌కు రూ.2.25 లక్షలు, మూసాపేటకు చెందిన ముదావత్ చిన్మయ్‌కు రూ.50 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

మోతీనగర్: పాండురంగానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సాధూరాం ఐ హాస్పిటల్, లయన్స్ క్లబ్ బంజారా హిల్స్ ఐ కేర్ విజన్ సెంటర్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ప్రతి నెల 2వ, 4వ శుక్రవారం, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మోతీనగర్‌లోని పాండురంగానగర్ పార్కులో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెబ్‌పేజీ ఆవిష్కరణ



వెబ్‌పేజీని ఆవిష్కరిస్తున్న ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉపాధి పొందగల నైపుణ్యం కలిగిన సాంకేతిక ఆరోగ్య కార్యకర్తలను సృష్టించడమే లక్ష్యమని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ కింద వృత్తి అధ్యయనాలు, నైపుణ్య అభివృద్ధి విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఒకేషనల్ స్టడీస్ విభాగం వెబ్‌పేజీని అధికారికంగా ప్రారంభించారు.

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ, ఫేజ్ 2, 12వ డివిజన్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు, లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాతృకపూజ, ప్రాశనం, రక్షాబంధనం, ఋత్విక్ వరుణం, దీక్షాధారణం, యాగశాల షోడశస్తంభపూజ, లక్ష్మీగణపతి హోమం, తీర్థప్రసాద వితరణం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 5 గంటలకు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి అభిషేకం, సహస్ర నామార్చన, 108 సార్లు మన్యుసూక్త పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 5:30 గంటలకు మూలమంత్ర హోమాలు, 6:55 గంటలకు లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 6:30 గంటల నుంచి శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విశేష పూజలు, ఆవాహిత హోమం, లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

• వేసవి శిక్షణా శిబిరానికి విశేష స్పందన



చెస్ నేర్చుకుంటున్న విద్యార్థులు



వేసవి శిక్షణకు హాజరైన విద్యార్థులు

బాలానగర్: వేసవి కాలం వచ్చిందంటే శిక్షణ శిబిరాలకు ఉండే డిమాండ్‌ను చెప్పనక్కర్లేదు. ఏ శిబిరంలో చూసినా ఆయా క్రీడలు, రంగాల్లో శిక్షణ పొందేందుకు పెద్ద సంఖ్యలో పిల్లలు క్యూ కడుతుంటారు. అయితే ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉంటున్న చిన్నారులు ఈ శిక్షణా శిబిరాలకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమై అవి విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ శిబిరాలను విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు, వారికి కొత్త అంశాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించే విధంగా రూపొందించారు. ఈ నెల 1వ తేదిన ప్రారంభమైన శిబిరాలు 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బాలానగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ శిక్షణ శిబిరానికి హాజరయ్యే ఒక్కో విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 చొప్పున వెచ్చిస్తోంది. ఈ శిబిరాల్లో ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

శిక్షణ ఇచ్చే అంశాలు ఇవే..

– మొన్నటి వరకు చదువుల్లో మునిగి తేలిన విద్యార్థులకు ఆట విడుపుతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆయా అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఆట పాటలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, స్టోరీ టెల్లింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్, కంప్యూటర్ స్కిల్స్, వెబ్ డిజైనింగ్, యోగా, ఇండోర్ గేమ్స్, క్రియేటివ్ ఆర్ట్స్, డ్రాయింగ్, పెయింటింగ్, వంటి అంశాల్లో అనుభవజ్ఞులైన వాలంటీర్లతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆయా మండలాల ఎంఈఓలు ప్రతినిత్యం శిక్షణ శిబిరాలను పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుంది



వేసవి శిక్షణా శిబిరాలకు విద్యార్థులు బాగానే హాజరవుతున్నారు. విద్యార్థుల్లో దాగి ఉండే ప్రతిభను వెలికి తీయడానికి ఎంతో ఉపయుక్తంగా ఈ శిబిరం ఉంది. విద్యార్థుల్లో స్నేహతత్వం, చదువులో పోటీ పెరుగుతుంది. సబ్జెక్టులో ఉండే భయం పోయి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుంది.

– అరుణజ్యోతి, హెచ్‌ఎం, జడ్పీహెచ్‌ఎస్, బాలానగర్



పెయింటింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు



మ్యాథ్స్ పజిల్‌ను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

నాణ్యతతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

• పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్ మెడికల్ సొసైటీ, వివేకానందనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ వన్‌లో రూ.35 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం రాక ముందే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్లు ప్రియాంక, ఝాన్సీ, సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, ఆల్విన్ కాలనీ ఫేజ్ 1 అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, కమల ప్రసన్న నగర్ అధ్యక్షులు చంద్రశేఖర్, మాధవరం నగర్ అధ్యక్షులు రమణారెడ్డి, ఆంజనేయులు, జగదీష్‌గౌడ్, రాఘవులు, మోహన్‌రావు, సత్యనారాయణ, విద్యాసాగర్, వెంకటేశ్వరరావు, రామచందర్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్ కాలనీ అపార్టుమెంట్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ఆయనను కలిశారు. నూతన కమిటీని ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ కాలనీ అపార్టుమెంట్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్. వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ఆర్‌కెవి ప్రసాద్, సెక్రటరీ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కామరాజు, ట్రెజరర్ బిఎస్ఎన్ మల్లేశ్వరరావు, మెంబర్లు నరేంద్ర బాబు, చక్రవర్తి, ప్రసాద్ రాజు, జగన్‌మోహన్‌రెడ్డి, అనిల్ కుమార్, పూర్ణ చందర్‌రావు, శ్రీను, బాబు, స్వామి, రాధిక, సత్యవతి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

నీటి ఎద్దడిని నివారించాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో తాగునీరు రావటం లేదని, వాటర్ ట్యాంకర్‌లను తెప్పించుకోవాల్సి వస్తుందని గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. వాటర్ ట్యాంకర్‌లు తెప్పించుకోవటంతో ఆర్థిక భారం ఎక్కువ అవుతుందని, కాలనీ వాసులకు మంచినీరు అందించాలని గురువారం కార్పొరేటర్ సబిహా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో మంచినీరు అందేలా అధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న దేశ వ్యాప్త సమ్మె : సీఐటీయూ

బాలానగర్: దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ అన్నారు. గురువారం సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం దేశంలో అందరికీ సమాన పనికి సమాన వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కేంద్రం కార్పొరేటర్ వర్గాలకు కొమ్ము కాస్తుందన్నారు. 20న జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కుమార్, గణేష్, సత్యనారాయణ రెడ్డి, బాబురావు, రహీమ్, వినేష్ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

11న బొటానికల్‌లో గార్డెన్ బర్డ్ వాక్

గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 11న బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్ నిర్వహిస్తున్నట్లు టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బర్డ్ వాక్ కొనసాగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పక్షుల జాతులను గుర్తించడం, ఏ పక్షులు ఏ వాతావరణంలో, ఏ రకమైన వృక్షాలపై గూళ్లు కడతాయి, ఎలాంటి ఆహారం తీసుకుంటాయి, ఎలా కదులుతాయి, వాటి ప్రవర్తన ఉంటుందో పక్షి నిపుణులు వివరిస్తారని పేర్కొన్నారు. బర్డ్ వాక్ రావాలనుకునే వారు 9885298980, 7382307476 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

మూసాపేట: దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ అన్నారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పక్కన పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సత్యవేద ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోల సహాయంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ రాజేష్, డీఐ వెంకటేశం, ఎస్ఐలు రామకృష్ణ, నాగేశ్వరరావు, నరసింహ, శ్రీనివాస్, సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన డీసీపీ సురేష్ తదితరులు

వంతెనపై గుంతలు పూడ్చాలి

• కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



గుంతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఉషా ముళ్లపూడి రోడ్డు ప్రధాన రహదారిలో తులసివనం వద్ద ఉన్న వంతెనపై గుంతలను పూడ్చాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే ప్యాచ్ వర్కు చేసి గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి మీద వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, పోశెట్టి గౌడ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలు కల్పించాలి



సర్వేలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: బస్తీదవాఖానాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్ అన్నారు. హనుమాన్‌నగర్, వెంకటేశ్వరనగర్, ఆస్‌బెస్టాస్ కాలనీల్లోని బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలపై గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌకర్యాలు లేకపోవడంతో రోగులు రోజుల తరబడి మందులు కోసం బస్తీ దవాఖానాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన స్టాఫ్ లేకపోవటం వల్ల రక్త పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించటం లేదన్నారు. దుర్వాసనతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిబ్బందికి ప్రతి నెలా జీతాలు సమయానికి ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే 12న కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, ఏ. రంగారెడ్డి, కృష్ణారావు, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పది' టాపర్లకు సన్మానం



మూసాపేట: పేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి జిల్లా మొదటి ర్యాంక్ సాధించటం అభినందనీయమని మూడిచింతల్‌పల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సంధ్య అన్నారు. మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో జిల్లా, మండల స్థాయిలో టాప్ ర్యాంకులు, 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం సన్మానించారు. సోషల్ వర్కర్ టీఎల్‌రెడ్డి 15 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను వారి తల్లిదండ్రులు శ్రద్ధతో చదివిస్తే మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. విద్యార్థులు ర్యాంకులు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి కూడా ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, శ్రీరంజన్, అరుణ, అనురాధ, మారుతిదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న రామకృష్ణ

గచ్చిబౌలి: వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ తీసుకుంటే మహిళలు స్వయం ఉపాధికి అవకాశం ఉంటుందని టీజీఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ పేర్కొన్నారు. కొండాపూర్ బెటాలియన్‌లో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెస్ మేకింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ తీసుకున్న వారికి స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కొండాపూర్ బెటాలియన్ క్యాంపస్‌లో చేపడుతున్న శిక్షణ తరగతులను సమీప ప్రాంతాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ రాం మోహన్, కమాండెంట్ సతీమణి సంధ్యారాణి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై నిరసన దీక్ష



నిరసన దీక్షకు మద్దతు తెలుపుతున్న జగదీశ్వర్ గౌడ్

చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ నగర్ ఫేజ్–5కు ఆనుకున్న అంబేడ్కర్ కాలనీలో ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారని, జీహెచ్‌ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణదారులపై నిర్లక్ష్యం చేస్తూ వారికి వత్తాసు పలుకుతున్నారని గురువారం జనప్రియ నగర్ ఫేజ్–5లో కాలనీవాసులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాల్సిన అధికారులే నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారన్నారు. జనప్రియ నగర్ పక్కన ఉన్న అంబేడ్కర్ కాలనీలో 100, 120 గజాల్లో ఇళ్ల నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు జనప్రియ నగర్ రోడ్డును చూపించి అనుమతులు పొందుతున్నారన్నారు. ఓ బిల్డర్ నిర్మిస్తున్న భవనంకు జనప్రియనగర్ రోడ్డు చూపించి అనుమతులు తీసుకొని ఇష్టానుసారంగా సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నిరసన దీక్షకు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ సంఘీభావం తెలుపుతూ జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే జనప్రియనగర్ ఫేజ్–5 కాలనీ వాసులకు ఇబ్బందులు కలగకుండా వారికి నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసనలో కాశీవిశ్వనాథ్, రవికుమార్, శేఖర్‌రెడ్డి, వర్మ, కిషన్‌రావు, రంజిత్‌రెడ్డి, రామాంజనేయులు, జ్యోతిరెడ్డి, సత్యలక్ష్మి పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితుల రిమాండ్

బైక్ పార్కింగ్ విషయంలో గొడవ



నిజాంపేట్: ద్విచక్ర వాహనం పార్కింగ్ కోసం జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కొంతమంది మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్1లో నివాసముంటున్న సంతోష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. తన సడ్డకుడు అయిన అబ్రహం కూడా అదే కాలనీలో తన కుటుంబంతో నివాసముంటూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. సంతోష్ ఉంటున్న బ్లాక్‌లోనే బిహార్‌కు చెందిన ధీరజ్ కుమార్ 2 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. ధీరజ్ కుమార్ చుట్టాలు కూడా అదే కాలనీలో వేరే బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. ధీరజ్ కుమార్ ఇంటికి వచ్చిన చుట్టాలు వారి బైక్‌ను సంతోష్ పార్కు చేసే స్థానంలో పార్కు చేస్తుంటే సంతోష్ వారిని పక్కకి పెట్టమని చెప్పేవాడు. అదే విధంగా మే 6వ తేదీ రాత్రి 11:30 గంటల సమయంలో ధీరజ్ కుమార్ బంధువు బైక్ పార్కు చేస్తుండగా అతనితో సంతోష్ తన బైక్‌ను కొంత పక్కకి పార్కు చేయమని చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. ధీరజ్ కుమార్ పాతవి మనసులో పెట్టుకొని తమ బంధువు బైక్‌ను ఎందుకు పార్కు చేయవద్దని అన్నావని సంతోష్‌ను తిట్టడం ప్రారంభించాడు. ధీరజ్‌కుమార్ వినకుండా సంతోష్‌ను ఇష్టం వచ్చినట్లు కొట్టి, అదే కాలనీ ఉంటున్న తమ్ముడు సంతోష్ సింగ్, రామ్‌రతన్ సింగ్, అక్క కొడుకులైన రోహన్‌కుమార్ సింగ్, రోహిత్ కుమార్ సింగ్‌లను పిలిచి సంతోష్‌ను కట్టెలతో కొట్టారు. ఇంతలో రోహన్ కుమార్ సింగ్ ఒక రాడ్ తీసుకొని సంతోష్‌ని కొట్టగా.. అతని ఎడమ చేయి విరిగింది. ఈ గొడవ చూసిన సంతోష్ స్నేహితులు సునీల్, సమద్, సడ్డకుడు అబ్రహం గొడవ ఆపడానికి ప్రయత్నించగా వారిపై కూడా దాడి చేశారు. సంతోష్ సింగ్ అబ్రహం చెంప కొరికాడు. ఈ మేరకు సంతోష్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ధీరజ్ కుమార్, రోహన్ కుమార్ సింగ్, రామ్‌రతన్ సింగ్, సంతోష్ సింగ్, రోహిత్ సింగ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాచుపల్లి సీఐ తెలిపారు.